SWATI ~~April~~ May 1981



పాతకెరటాలు

పాతకెరటాల్లో ఇంతవరకు ప్రపంచప్రఖ్యాతి చెందిన నవలలను పరిచయం చేస్తూవచ్చాను. ఇందులో ఎక్కువభాగం- పాశ్చాత్య దేశాలకి చెందిన సాహిత్యం పరిచయం చేశాను. ఈనెల నవలకాక- ఒక డైరీ- ఒకానొక ప్రయాణీకుని డైరీ గురించి పరిచయం చెయ్యబోతున్నాను.

మన దృష్టిలో- కాలక్షేపం కోసం చదివే నవలలు- అందులోనూ కథాభాగం బాగా కలిగినవే- సాహిత్యం కిందవస్తుంది అనుకుంటూ వుంటాము. చిన్నకథ, నాటకం, కవిత్వం, వ్యాసాలు యివన్నీకూడా సాహిత్యంక్రిందేవస్తాయి. ఇవికాక ప్రయాణపు అనుభవాలు - దీనినే రీడర్స్ డైజెస్ట్‌లో 'ఆర్మ్ చైర్ ట్రావిలోగ్' అంటూ నెలల వారీ ప్రచురిస్తూ వుంటారు. అంటే ఇంట్లో పడక కుర్చీలో కూచుని- దూరదేశాలు పయనించి రావటం అని. పాఠకునికి అందుబాటులో లేని- ఒక మారుమూల ప్రదేశాన్ని తీసుకొని, ఆదేశపు శీతోష్ణ స్థితి నుంచి, అక్కడ యాత్రికులు వుండటానికి అయ్యే హొటల్ ఖర్చుదాకా ఇస్తారు. చూడవలసిన ప్రదేశాలు, అక్కడజరిగే వివిధ ప్రదర్శనలు ఇలా- రైలుమీదనో, విమానంమీదనో, కారులో రోడ్డు పైన ప్రయాణం చెయ్యడానికో. ఎన్నిమైళ్ళు ఎంత కాలం, ఎంత ఖర్చు యిత్యాది వివరాలన్నీ యిస్తూ- రంగుల ఫొటోలు కూడా వేస్తూంటారు. ఒకసారి 'వెన్నిస్' నగరం గురించి రాశారు. అక్కడ నగర మధ్యలోనున్న కాలువద్వారా ప్రయాణం

మాలతీ చందూర్

ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్ర

చేస్తూంటే- పడవలునడిపేవాళ్ళు ఎంత తీవ్రంగ తిట్టుకుంటారో కూడా వివరంగా చెప్పారు.

మన తెలుగులో నవల కథానిక,కవిత్వం,వ్యాసరచనబాగా ప్రగతి సాధించి, ప్రత్యేకమైనప్రచారం పొందగలిగాయి. కాని, ప్రయాణానుభవాలూ యాత్రా విశేషాలూమీద పుస్తకాలు ఆట్టేరాలేదు. పత్రికల్లో అక్కడా అక్కడా - తాము చూసిన దేశాల గురించి ఒకరిద్దరు రాశారేతప్ప, 'ట్రావిలోగ్' అన్నదిమన తెలుగులో పాప్యులర్ అవలేదు పర్యటన-ప్రపంచ పర్యటన కానీండి,స్వదేశ పర్యటన కానీండి—మనిషి దృక్పథాన్ని విస్తృతపరుస్తుంది. నత్తగుల్లలాగా వుండే మనిషికూడా-ప్రయాణాల్లో తోటి ప్రయాణీకుడితో మాట్లాడటం అలవరచుకుంటాడు. కొత్తమొఖాలు, కొత్త ప్రదేశాలు మనిషిని నిత్య యువకుని చేస్తాయి. ఆ ప్రయాణానుభవాలని— చుట్టూవారికి చెప్పాలని సగటు మనిషి అనుకుంటే, రచయిత తన పాఠకులతో అనుభవాలని పంచుకోవాలను కుంటాడు. కొందరు తమ అనుభవాలని రికార్డు రూపంలో పదిలపరచుకోవాలను కుంటారు. ఇట్లా పదిలపరిచిన విశేషాల వల్లనే చైనాదేశపుయాత్రికుడుహుయాన్ సాంగ్ వల్ల, మన భారతదేశపు పూర్వ చరిత్ర పదిలపరచబడింది.మార్కోపోలో వల్లనే మన జాతి అవున్నత్యము, మన దేశపు వైభోగము చరిత్రపుటల్లో చోటు చేసుకుంది. ఈ రికార్డెడ్ హిస్టరీవల్లనే అటు ఆశోకుని కాలం నుంచి, ఇటు పదకొండో శతాబ్దం దాకా మనదేశం ఎలా పయనించినది - ఎటు వెళ్ళినదీ తెలియవచ్చినది.

'టెన్ డేస్ దట్ షూక్ ది వరల్డ్' 'ప్రపంచాన్ని వూపిన పదిరోజులు'— అనే పేరుతో జాన్‌రాడ్ రాసిన పుస్తకం అతను రష్యన్ రెవెల్యూషన్ పది రోజులూ ఎలా నడిచినది చెబుతుంది. పత్రికా విలేఖరిగా వెళ్ళిన యీ జాన్ రీడ్ ఆ పదిరోజుల్లో రష్యన్ ప్రజల జీవితం ఎలా స్తంభించిపోయినదీ విశదంగా వర్ణించి చెపుతాడు. ఇది రాజకీయపు యాత్రావిశేషం అని చెప్పాలి.

తెలుగులో'నానారాజ్య సందర్శనం' అని తిరుపతి వెంకటకవులు రాశారు. ఇది వారి కవితా ప్రతిభకి శతావధాన ప్రతిభకీ నిదర్శనం. తమ విజయపరంపరలూ-అనుభవాలూ వుదహరించారు. ఇటీవలనే మలేసియా పర్యటించిన శ్రీయుతులు నారాయణరెడ్డి, దాశరధి గార్లు తమ తమ ప్రయాణానుభవాలు వ్యాసాల రూపంలో ప్రచురించారు. అల్లాగే శ్రీ దాశరధిగారి అమెరికా పర్యటన, నారాయణరెడ్డిగారి రష్యా పర్యటనకూడా పత్రికల్లో వ్యాసాలరూపంలో వచ్చాయి. అవి కొంతవరకూ 'ట్రావెలోగ్' అని చెప్పుకోవచ్చు.

ఈ నెల నేను ఇతర భాషా పుస్తకం పరిచయం చెయ్యటంలేదు.మనతెలుగు భాషలోని-తెనుగు పుస్తకాన్ని 'స్వాతి' పాఠకులకి పరిచయం చేస్తున్నాను. ఇందులో విశేషం ఏమిటి? ఇది ఎందుకు పరిచయం చెయ్యాలి? పేరు చెపుతే కొనుక్కుని చదువుకోలేమా ? అన్న ప్రశ్నలు రావచ్చు. ఈ పుస్తకం అన్ని తెలుగు పుస్తకాలలాగా— విక్రేతల వద్ద దొరకదు. సుమారు నూటయాభైఏళ్ళ క్రితం- 1838 ప్రాంతాల ప్రచురింపబడింది. 1830 సెప్టెంబరు- 18వ తేదీన

యీ పుస్తకం రాయటానికి పూనుకున్నారు. అంటే సరిగ్గా నూటయాభైఏళ్ళ నాటి తెలుగు పుస్తకం అన్నమాట. ఇది మొదటిసారి 1838లో అచ్చయింది. 1869లో యింకోమాటు అచ్చయింది. ఆ తరువాత చాలారోజులు మరుగున పడిపోయింది. 1941లో దీని మొదటి అచ్చుప్రతిని, వ్రాతప్రతిని బయటకి తీసి శ్రీ దిగవల్లి వెంకటశివరావుగారు ప్రచురించారు.

ఏనుగుల వీరాస్వామయ్యగారు 1780లో జన్మించారు. 1836దాకా చెన్నపురిని- పూర్వంమద్రాసుని చెన్నపట్నం అని పిలిచేవారు. చెన్నపట్నంలో అప్పుడు సుప్రీంకోర్టు వుండేదిట. ఇప్పుడున్న హైకోర్టు ఆకాలంలో కుంపిణీ వారి అధ్వర్యంలో సుప్రీంకోర్టుగా నిర్వహింపబడేది. ఆ కుంపిణీ వారు- అంటే ఈస్టిండియా కంపెనీవారి కొలువులో వాలంటీరుగా తన పన్నెండో ఏటనేప్రవేశించి, క్రమంగా 1819 నాటికి తెలుగు, తమిళ మూతర్జుమాచేసే ఇంటర్‌ప్రెటర్ వుద్యోగంలో ప్రవేశించి, ఆ వుద్యోగంలోనే కుంపిణీవారిప్రాపకమూ, ధనమూ బాగా ఆర్జించారాయన.

ఇంగ్లీషు తెలుగు డిక్షనరీరాసిన సి.పి. బ్రౌన్ దొర ఈ వీరాస్వామి గారికి మిత్రులు. ఈయనేకాదు, అప్పటి ఎడ్వకేట్ జనరల్ జార్జి నార్టన్ కూడా వీరికి మిత్రులు. వీరాస్వామిగారు 'హెడ్ ఇంటర్ ప్రిటర్' గా 1835 దాకా పని చేసి— అందరికీ ప్రీతి పాత్రులుఅయి, పదవిని విరమించుకున్నారు. 1836 అక్టోబరులో వీరు స్వర్గస్తులైనారు. వీరు చనిపోయిన రెండు సంవత్సరాలకి ఈ కాశీయాత్ర చరిత్ర ప్రచురితమయింది.


ఈ వీరాస్వామిగారు కన్యాకుమారి నుంచి — కాశ్మీరం వరకూ రెండుసార్లు భారతదేశమంతా పర్యటించారు. ఆ రోజుల్లో కాశీకిపోయినవాడూ కాటికిపోయినవాడూ-ఒకటేనన్న సామెత వుండేది. నూటయాభై ఏళ్ళక్రితం మనదేశం ఎలా వుండేది? ఒక్కసారి గతంలోకి వెళ్ళి వూహించుకోండి. ఇప్పటిలాగా రైలు మార్గం లేదు. ఎక్స్‌ప్రెస్‌లూ- సూపర్‌ఫాస్ట్‌లూ లేవు. విమానాలు- బస్సులూ లేవు. రోడ్లులేవు. నదులూ, అరణ్య మార్గాలూ, పర్వతపంక్తులూ దాటుకుంటూ, దొంగల భయంతో, క్రూర మృగాల భీతితో కాలినడకన - పల్లకీల్లోనూ, మేనాల్లోనూ ప్రయాణించేవారుట. అలా రెండుసార్లు కన్యాకుమారి నుంచీ కాశ్మీర్‌దాకా ప్రయాణించారు ఈ వీరాస్వామిగారు.

షుమారు వందమంది పరివారంతో, స్త్రీలూ-కుటుంబసభ్యులూ, మునలీముతకాతో ఆచారాలవల్ల నిష్టా గరిష్టులయిన స్త్రీలతో, వంటసామానూ, డేరాలూ డేరా కర్రలూ, బియ్యమూ పప్పులూ వగైరాలతో, మందులూ మాకులుతో ఇలా 1830వ సం॥ మే మాసం 18 వ తేదీ గురువారం రాత్రి 9 గం॥ మద్రాసులో బయలుదేరి, తిరిగి 1831 సం॥ సెప్టెంబరు మూడవ తేదీనాటికి మద్రాసు జేరుకున్నారు. అంటే ఒక సంవత్సరం మూడు నెలల-పదిహేను రోజులపాటు పర్యటించారన్నమాట.

ఈయన మద్రాసులో బయలుదేరి,

ఒక మహిళ ?

ఒక పెద్ద ఇన్‌కంటాక్సు ఆఫీసు !!



తిరుపతి, కడప, శ్రీశైలం హైద్రాబాద్ నిర్మల్, నాగపూర్, జబల్‌పూర్, రమా, మిర్జాపూర్, అలహాబాద్, కాశీ, పాట్నా, గయ, మళ్ళీ పాట్నా, మాంఘీరు, రాజమహర్, కృష్ణనగర్, కలకత్తా, ఛత్రిపురం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నెల్లూరు, తిరువళ్ళూరు మీదుగా తిరిగి చెన్నపట్నం చేరుకున్నారు. —అంటే తిరుపతినుంచి రాయలసీమమీదుగా నైజాంస్టేటు చేరుకుని, అక్కడి నుంచి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, అటునుంచి ఒరిస్సా మీదుగా, మళ్ళీ ఆంధ్రదేశపు కోస్తా జిల్లాల మీదుగా, మద్రాసు చేరుకున్నారు—అంటే ఆయన వెళ్ళిన దారిన తిరిగి రాలేదు. ఈ రోజుల్లో రైల్వేవారిస్తున్న 'సర్క్యులర్ టూర్ టికట్'లాగా షుమారు అయిదు రాష్ట్రాలు పర్యటించి వచ్చారు. ఇవన్నీ కాలినడకను, బోయీలు మోస్తున్న పల్లకీల్లోనూ వెళ్ళారన్నది మనం మర్చిపోకూడదు.

ఈ ప్రయాణంలో ఈయన షుమారు 289 వూళ్ళలో మజిలీ చేశారు—అంటే ఆయా వూళ్ళలో దిగి. అక్కడ వంటలు వండుకుని, విశ్రాంతి తీసుకుని, మళ్ళీ ప్రయాణం సాగించారు. మజిలీకి మజిలీకి మధ్య చిన్న చిన్న వూళ్ళు అనేకం దాటుకుంటూ వచ్చారు. వాటి గురించి వివరాలు, వర్ణనలు చాలా చక్కగా యిచ్చారు. వీరాస్వామిగారు కృష్ణా, గోదావరి, పెన్న, నర్మద, గంగ, మహానది, ఋషికుల్య నది, తమసానది, సువర్ణముఖి, పినాకిని వంటి నదులు. ఇవిగాక చిలకసముద్రం, తాండవనది, శారదానది వంటి చిన్న నదులు దాటారుట. చివర చెప్పిన తాండవ, శారదా నదులు ఆంధ్రలో తుని, కశింకోటవద్ద వున్నాయి. వీటి పేర్లు చాలామందికి తెలియవుకూడా.

ఈ 'కాశీయాత్ర' చదువుతుంటే, ఈనాడు మనకి వాడుకలోలేని తెలుగు మాటలు అనేకం కనిపిస్తాయి. ఇంగ్లీషు మాటలకి అర్థం తెలియకపోతే డిక్షనరీ వెతికినట్టే- ఈ మాటలకి అర్థం ఏమిటి అన్న సంశయం కలుగుతుంది. పుస్తకం చివర వాటి వివరాలు యిచ్చి— మంచిపని చేశారు సంపాదకులు శివరావుగారు.

దోవసరాళము అని చాలా చోట్ల వాడారు. అంటే సౌకర్యము అనిఅర్థం. సదా వృత్తి అంటే స్వయం పాకం. వండుకోడానికగు పప్పు బియ్యంవగైరా యివ్వటంట. ఇలా చాలా కొత్తతెలుగు మాటలు అంటే ఈనాటి మనకితెలియని కొత్తమాటలు చాలా కనిపిస్తాయి.

హైద్రాబాద్‌లో కాకులు బహుతక్కువగా వుంటాయి. ఈ విషయం కోస్తా ప్రాంతం నుంచి వెళ్ళిన గృహిణులు చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. కాకులు లేకపోవటం గురించి చాలా మంది పత్రికల్లో వ్రాశారు. ఎందువల్లనో తెలుసా? ఒకప్పుడు హైద్రాబాద్‌లో డేగల్ని పెంపుడు పక్షులుగా పెంచే వారట. డేగలూ, రాబందులూ చిన్న పక్షుల్ని బ్రతకనివ్వవుగా. అందుకనే హైద్రాబాద్‌లో కాకులులేవు. అల్లాగే హైద్రా

ఇద్దరు మహిళలు ?
ఒక పెద్దన కృత్యపు పోటీ !!



బాదిలోని మూసీనది అసలు పేరు "ముచుకుంద" నది-అనిట. ఇటువంటి తమాషా విషయాలు వుదహరించారు

మైసూరురాష్ట్రానికి-ఆ పేరు ఎందుకు వచ్చిందో తెలుసా? దుర్గాదేవి, చాముండేశ్వరి కొండమీద, మహిషాసురుని వధించి, శ్రీశైలంలో భ్రమరాంబగా వెలిసిందిట అందుచేత ఆ రాష్ట్రానికి మహిసూరు-అది క్రమంగా మైసూరు అయింది.

ఇంగ్లీషు వారికి పరంగీలని ఎందుకు పేరువచ్చిందో తెలుసా? ఫిరంగులతో సహవాసం చేశారు కాబట్టి పరంగీలని పిల్చారుట. ఇప్పటికీ మద్రాసులోని సెయింట్ థామస్ మౌంట్‌ని పరంగి కొండ అని పిలుస్తూంటారు కొందరు.


ఈ రోజుల్లో తిరుపతి, శ్రీశైలంవంటి యాత్రాస్థలాలని- ఇంచుమించు పిక్నిక్ స్పాట్స్‌గా వాడుకునే పరిస్థితులు వొచ్చాయి. వీటిని దర్శించడమూ చేరుకోడమూ అంతా సులువు అయింది. ఈ పుణ్యక్షేత్రాలు కాటేజీలు, హొటల్స్, కొండమార్గాన్న బస్సులూ వగైరాతో- యివి 'హాలిడే'కి వెళ్ళేటువంటి స్థలాలుగా రూపొందినాయి. శ్రీశైలానికియీమధ్యనే బస్‌పడింది- అంత క్రితం ప్రయాణం కష్టంగా వుండేది. ఆరోజుల్లో అంటే 150 ఏళ్ళక్రితం బాటకిరువైపులా కొండరాళ్లూ-చిక్కని అడవీ వుండేదిట. అడవి మధ్యలోంచి వెళ్తుంటే పల్లకీ బోయీలవంటికి- చెట్లకొమ్మలు గీరుకు పోయేవిట. శ్రీశైలప్రాంతాల చెంచులూ, కోయవాళ్ళూ, భిలులూ విరివిగావుండేవారు. యాత్రీకులకి ఆయా కోయదొరలే - వసతి సౌకర్యాలు కలిగించేవారుట.

ఒక్కొక్క సారి మన ప్రస్తుత పరిస్థితులని పరిశీలిస్తుంటే- నాగరికంగా మన దేశం ఎంత ప్రగతిని సాధించినా, స్వతస్సిద్ధమయిన కొన్ని పరిస్థితులు నూటయాభైఏళ్ళ క్రితం ఎలా వున్నాయో— యిప్పుడూ అలానే వున్నాయని అనిపిస్తూ వుంటుంది. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌ని- నాగపూర్ ప్రాంతాల అపి— దొంగలు ప్రయాణీకులని దోచుకున్నారని అశుధ్య పేపర్లో వార్తలు చూశాం. నూటయాభై ఏళ్ళ క్రితం కూడా వీరాస్వామిగారు ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా, హైద్రాబాద్–నాగపూర్‌లమధ్య దొంగలభయం, క్రూరమృగాల భయం ఎక్కువగా వుండేదిట అందుచేత తుపాకిలతో పాలె గాళ్ళను వెంటతీసుకెళ్ళేవారుట. పాలెగాళ్ళు అంటే పోలీసులు అని అర్థం.

కొన్నిప్రాంతాలవీళ్ళకి విడిదిస్థలాలు సరిగ్గా అమరేవికావు. కొందరువర్తకులు విడిదికి స్థలం యిచ్చి - ప్రయాణీకులని దోచుకోవటం కూడాకద్దు. అందుకని తపాలా రన్నర్స్ - అంటే తపాలు తీసికెళ్ళే ఆయారాష్ట్ర ప్రభుత్వాల, లేక కంపెనీవారి వుద్యోగులని ఏర్పాటు చేసుకున్నారుట. ఈ రన్నర్స్ ప్రయాణీకులకంటే ఒకరోజు ముందుగా వెళ్ళి మజిలీ చేయబోయే నగరం విడిది,

ముగ్గురు మహిళలు ?

ఒక పెద్ద రేడియో ప్రసార కేంద్రం !!



వసతివగైరా ఏర్పాటు చేసేవారుట.

రైల్వేలు పడినకొత్తలో- గుర్రంమీద రౌతుకూచుని- రైలు యింజనుకి ముందుగా పరుగెత్తి, యీనాటి రైల్వే సిగ్నలు వలె వ్యవహరించేవాడు. అలాగే వుత్తరాలనికూడా- రన్నర్స్‌పరుగెత్తుకుంటూ ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వుత్తరాల సంచీ జేరవేసేవారు. వీరికి సంస్థానమైతే ఆ సంస్థానమూ, లేక కంపెనీ వారు అయితే కంపెనీవారూ జీతం భత్యంఇచ్చేవారు. అందుచేత సామాన్య ప్రజలు యీ'రన్నర్స్'పట్ల భయభక్తులు కలిగివుండేవారు.

బరోడా సంస్థానంలో- యాత్రికులని దొంగల బారినుంచి రక్షించటానికి - మంచి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేవారు, ఆ కాలంలో. 'సరాయి' అన్న విశాలమైన చావడిలో వీరాస్వామిగారికి వెంట వచ్చినవారికి మకాం ఏర్పాటు చేశారు. నాలుగు పక్కలా ఎత్తయిన ప్రహరీ గోడలూ- లోపల విశాలమైన చావడి- ఆ చావడి లోపల అరలు అరలుగా జైలుగదులవంటి చిన్న కొట్లు. ఆ కొట్లలోపల యాత్రీకులనిపెట్టి, ప్రహరీ గేటుకు తాళాలుపెట్టి, తెల్లవార్లూ రాణా జవానులు- తుపాకీలతో కాపలా కాసేవారుట. యాత్రీకుల ధన ప్రాణాలకి భయం లేదు గాని, ఒకరాత్రివేళ దేహ బాధకలిగితే బయటకు వెళ్ళే అవకాశం లేదు- అంటూ తమాషాగావర్ణిస్తారు ఈ ఏర్పాటుని.

ప్రయాగ స్థల మహత్యం. యమునా నది పుట్టుక, క్రీస్తుమతం గురించి,మన పురాణేతిహాసాల గురించీ, కాశీలో ఔరంగజేబు నిర్మించిన మసీదు, అహల్యాబాయి.ఇత్యాది విషయాలు చాలా వివరంగా చెప్పారు. షుమారు ఆరు రాష్ట్రాలు-యిప్పటి విభజన ప్రకారం ఆరురాష్ట్రాలు-పర్యటించారువీరాస్వామిగారు. నూటయాభై ఏళ్ళక్రితం అనేక స్వదేశ సంస్థానాలతో, చిన్నజమీందారీలతో. ఈస్టిండియా కంపెనీవారి అధీనంలోనూ వుండేది ఈయన పర్యటించిన ప్రదేశం. కుంపిణీవారి నాణెములూ అయా ప్రదేశాలలోని నాణాలు, కాన్లు, అణాలు, మాడలు, డబ్బులు, యాగానులు. ఇలా ఈనాటి వారు విని వుండని నాణాల గురించి, అయాప్రాంతాల ప్రజల వేషభాషలు, అక్కడ దొరికే కూరలు, పప్పులు, ఆహార పదార్థాలు. ఇలా ప్రతివిషయం గురించీ వివరంగా చెప్పారు. సూటిగా చెప్పాలంటే ఆంధ్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఒరిస్సా, తమిళనాడు ఈ అరు రాష్ట్రాలలోని సామాన్య ప్రజలు ఎలా బ్రతికేవారో దర్పణంపట్టి చూపించారు వీరాస్వామిగారు.

ఒక తెలుగువాడు నూటయాభైఏళ్ళ క్రితం రాసిన- ప్రయాణపు దినచర్య యిది. ఇది మొట్టమొదట తమిళంలోకి తర్జుమా అయి ప్రచురించబడింది— తరువాత తెలుగులో పుస్తక రూపాన వచ్చింది అని ఒక ప్రచారం వుంది. అలా అయివుంటే మనకి యింకా గర్వకారణం. ఇదిమరాటీలోకి, ఆపైన ఇంగ్లీషులోకి కూడా తర్జుమా అయి ప్రచురింపబడిందిట.

నూటయాభై ఏళ్ళ క్రితం- దైవభక్తి వల్లనో లేకవేరేదేశంపర్యటించవలెనన్న యాత్రాభిలాషతోనో ఒక ఆంధ్రుడు నూరుమందిమనుషులతో పూర్వసువాసినులైన స్త్రీలతోసహా, కాలినడకన— పల్లకిలోనూ కాశీదాకా ప్రయాణించారు. అందరూ అన్నట్లు ఆయన కాటికి పోలేదు- మద్రాసుకి తిరిగివచ్చి—కాశీ సమారాధనచేసి, ఇంకా నాలుగేళ్లపాటు పదవిలో వుండి, అయిదేళ్ళ అనంతరం 1836లో మరణించారు. వీరాస్వామిగారు పరిపూర్ణమైన, ప్రజోపకరమైన, సాహసవంతమైన జీవితం గడిపారు.

అంతేకాదు, ఆంధ్రులు గర్వించదగిన ఒక యాత్రా దినచర్య ముందుతరాల వారికొరకు పదిలపరిచి వెళ్ళారు

జీవితమంటే- కేవలం నవలలూ, సినిమాలేకాదు- మనం ఏమిటి? మనం ఈనాడు ఇంత ఆధునిక సౌకర్యాలతో జీవితం గడుపుతున్నా మంటే- మన వెనకతరాలు ఎంత కష్టపడ్డారు- వారు ఎంత శ్రమకి ఓర్చి- మనకా రాజబాట వేశారు? అని అప్పుడప్పుడు వెనుతిరిగి చూసుకోడం ఎంతయినా మంచిది. మహావృక్షపు నీడలో నిల్చున్నప్పుడు, ఆ నీడచల్లదనాన్ని అనుభవిస్తున్నపుడు క్షణకాలం, ఆ చెట్టుని ఎవరునాటారు? అన్న ఆలోచన రావటం వివేకానికి చిహ్నం అటువంటివివేకమే జీవితాన్ని ముందుకి నడిపేది.

మనం ఏమిటి? మనచరిత్రఏమిటి?- అన్న విషయం సామాన్యమైన అనుభవాల్లో రంగరించి చెప్పారు వీరాస్వామి గారు తమ కాశీయాత్ర చరిత్రలో. ఇది తెలుగువారు చదవాలని, ఒకవేళ కొందరుచదివివుంటే, మళ్ళీ చదవాలని ఈనెల పరిచయం చేశాను.

ఇది ఎక్కడ దొరుకుతుందనిప్రశ్న. ఇది 'స్వాతి'పత్రిక వెలువడే- మీ బెజవాడలో 'విజయవాడలో' శ్రీ దిగవల్లి శివరావుగారివద్ద దొరుకుతుంది. వారి ఎడ్రసు కనుక్కుని, కొని, చదవండి

□□